కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధి

- పేదరిక నిర్మూలనలో దేశంలోనే రెండో స్థానం
- నీతి అయోగ్ నివేదికపై కేటీఆర్ హర్షం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృది పరుగులు పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందుకు నీతి ఆయోగ్ విడుదల చేసిన సస్టెయినబుల్ డెవలప్మెంట్ గోల్స్(ఎస్డీజీ) లెక్కలే నిదర్శనమని శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనతోపాటు సుస్థిరమైన అభివృద్ధికి పదేండ్ల పాటు కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ సాధించిన విజయాలను కేంద్ర సంస్థలు ఎన్నో సందర్భాల్లో ప్రశంసించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేదరిక నిర్మూలనలో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందన్న నీతి ఆయోగ్ నివేదికపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 2020-21తో పోలిస్తే 2023-24లో (ఎస్డీజీ)లో 74 స్కోర్‌తో తెలంగాణ ముందుందని చెప్పారు. తక్కువ ధరలో క్లీన్ ఎనర్జీని అందించటంలో 100/100 మార్కులు తెచ్చుకోవటం విశేషమని తెలిపారు. తాగునీటిని అందించడంలో 90/100, అభివృద్ధి, ఆర్థిక వృద్ధిలోనూ 84/100 స్కోరు సాధించటంపై సంతోషం వ్యక్తంచేశారు. కేసీఆర్ విజన్, సాహోసేపేత నిర్ణయాలతో తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మెరుగైనస్థితికి చేర్చిందని, ఈ ప్రభుత్వం కూడా ఆ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. రాజకీయ కక్షలు, ఫిరాయింపులపై పెట్టే దృష్టి.. రాష్ట్రాభివృద్ధిపై పెడితే ప్రజలకు మేలు జరుగుతుందని సూచించారు.

కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని నిలిచిన కాళేశ్వరం

- మేడిగడ్డను త్వరలోనే సందర్శిస్తాం
- ఎప్పటికీ గెలిచేది సత్యమే
- ప్రాజెక్టు మీద బురదజల్లితే చరిత్రహీనులే : కేటీఆర్

మేడిగడ్డకు పోటెత్తిన వరదపై మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేసిన ఫొటో

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): సత్యమే ఎప్పటికీ గెలుస్తుందని, త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తానని మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. బీఆర్ఎస్ ఎక్స్ అఫీషియల్ హ్యాండిల్‌లో 'కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టు.. నిండు కుండలా మేడిగడ్డ బ్యారేజీ' అంటూ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద వీడియోను పోస్టు చేశారు. 'మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయింది. కాళేశ్వరం కొట్టుకుపోయింది అని కాంగ్రెస్ పార్టీ, వందల కొద్దీ యూట్యూబ్ చానెళ్లు నెలల పాటు దుష్ప్రచారం చేసినా.. వాళ్ల కుళ్లు, కుతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఎదుగుదలను చూసి ఓర్వలేని సన్నాసులు ఎన్ని కుట్రలు చేసినా కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార. కేసీఆర్‌పై, కాళేశ్వరం మీద బురదజల్లే ప్రయత్నం ఎవరు చేసినా చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయం. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ పోస్ట్ చేశారు.

నేడు గవర్నర్‌ను కలవనున్న బీఆర్ఎస్ ప్రతినిధి బృందం

ఫిరాయింపులు, నిరుద్యోగ సమస్యలపై వినతి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలువనుంది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి పలు అంశాలపై ఫిర్యాదు చేయనుంది. ముఖ్యంగా పార్టీ ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాల్సిందిగా గవర్నర్‌ను కోరనున్నది. దానం నాగేందర్, కడియం శ్రీహరి లాంటి నేతల పార్టీ ఫిరాయింపుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసి మూడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఆయన ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేయనున్నది. నిరుద్యోగుల సమస్యలు, వారి పోరాటం, నమోదైన కేసులు తదితర విషయాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లనున్నది.

ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలి

- తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): కనీస మద్దతుధరకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 2018-19 నుంచి పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతుసాగుకు పెట్టిన పెట్టుబడికి 50శాతం కనీసం మద్దతు ధర నిర్ణయిస్తామని చెప్పినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా సూచించిన ధర కన్నా అతితక్కువగా కనీస మద్దతు ధరను అమలు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకం, పంట నష్టం జరిగిన 30రోజులలోపు పరిహారం చెల్లించేవిధంగా, వ్యవసాయాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకానికి అనుసంధానం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిద్దిపేట కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

'ఔట్‌సోర్సింగ్' పెండింగ్ జీతాలు చెల్లించాలి

- ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 19: ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నారని, పీఎఫ్ డబ్బులు కూడా జమ కావడం లేదని తెలిపారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తక్షణమే ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపాలని, 7 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు.

లోకం పోకడ



మిమ్మల్ని కలవడానికే ఢిల్లీ వస్తున్నాం సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	33.3°c	23.0°c
రంగారెడ్డి	32.0°c	21.9°c
మెదక్	30.6°c	23.5°c
నిజామాబాద్	29.6°c	23.7°c
కరీంనగర్	29.0°c	24.0°c
వరంగల్	29.0°c	22.5°c
నల్లగొండ	29.0°c	22.4°c
హైదరాబాద్	28.2°c	23.1°c
ఖమ్మం	28.0°c	24.0°c
మహబూబ్‌నగర్	25.1°c	22.4°c

నేతన్నల ఆత్మహత్యలు పట్టవా..?

- సోమవారం నుంచి ఆందోళన ఉధృతం
- సిరిసిల్లలో కార్మిక నాయకులు

సిరిసిల్లలో జరిగిన ఆసాముల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పవర్‌లూం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

రాజన్న సిరిసిల్ల, జూలై 19 (నమస్తే తెలంగాణ): ఉపాధి లేక నేతన్నలు ఆత్మహత్యలు, ఆకలి చావులకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ప్రభుత్వ విధానాల వల్లే సిరిసిల్ల వస్త్రపరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. లేని పక్షంలో సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ అంబభవానీ సమావేశ మందిరంలో శుక్రవారం తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసాములు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ హాజరై, మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ సక్రమంగా నడవక మరమగ్గాలు మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. 30వేల మంది కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో పది మంది కార్మికులు ఆకలిచావులు, ఆత్మహత్యలకు పాల్పడినా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మరమగ్గాలకు 10 హెచ్‌పీల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని, నాలుగో క్యాటగిరీ కింద విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని, పదికోట్ల మీటర్ల వస్త్ర ఆర్డర్లు ఇవ్వాలని, 2023 నుంచి కార్మికులకు రావాల్సిన సబ్సిడీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగించాలని తీర్మానించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం వంటావార్పు, మంగళవారం రాస్తారోకో, బుధవారం సిరిసిల్ల పట్టణం బంద్, గురువారం చలో హైదరాబాద్ కార్యక్రమాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి, నాయకులు చేరాల అశోక్, గోనే పర్శరాములు, పోరండ్ల రమేశ్, ప్రకాశ్‌రావు, దూస అశోక్, మండల రాజు, కొండ సుభాష్, చంద్రకాంత్, గోవిందు కనకయ్య, బూర శ్రీను, ఆడెపు కనకరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త హత్య కేసు డైరీ ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కార్యకర్త బీ శ్రీధర్‌రెడ్డి హత్య కేసు దర్యాప్తు డైరీని సమర్పించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఇందుకు జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి పోలీసులకు నాలుగు వారాల గడువు విధించారు. తన కుమారుడి హత్య కేసును దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడంలో పోలీసులు వైఫల్యం చెందుతున్నారని ఆరోపిస్తూ మృతుడి తండ్రి బీ శేఖర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇటీవల విచారణ చేపట్టింది. గత మే 23 తెల్లవారుజామున శ్రీధర్‌రెడ్డిని పదునైన ఆయుధాలతో అతి కిరాతకంగా నరికి చంపారని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ చెప్పారు. హతునికి అధికార కాంగ్రెస్ పార్టీలో శత్రువులు ఉన్నారని తెలిపారు. మంత్రిగా కొనసాగుతున్న స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తెచ్చి దర్యాప్తు జరగనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు. దర్యాప్తును తొక్కిపెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. దోషులకు సహాయం చేయడం కోసమే కేసు దర్యాప్తును మందకొడిగా చేస్తున్నారని చెప్పారు. హత్య జరిగి నెల రోజులు కావస్తున్నా పోలీసులు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదని అన్నారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, పోలీసులు ఏడుగురు సాక్షులను విచారించారని, నలభై మందికి పైగా సభ్యులను క్షుణ్ణంగా ప్రశ్నించారని చెప్పారు. పోలీసుల దర్యాప్తు న్యాయమైన రీతిలోనే ఉందని, దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషన్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించి, పిటిషనర్ ఆందోళనను పరిగణనలోకి తీసుకుని కేసు డైరీని నాలుగు వారాల్లోగా సమర్పించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. అప్పటివరకు విచారణను వాయిదా వేసింది.

2 నెలల్లో మానవ హక్కుల కమిషన్

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్రం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల నియామక ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ అద్నాన్ మహమ్మద్ గత ఏడాది వేసిన పిల్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్, జ్యుడీషియల్ సభ్యులు, సాంకేతిక సభ్యుల నియామకానికి మార్చి 10న నోటిఫికేషన్ వెలువడిందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. నియామక ప్రక్రియ పూర్తికి రెండు మాసాల గడువు కావాలని చెప్పారు. దీంతో విచారణ 8 వారాలకు వాయిదా పడింది.

గోదావరికి భారీగా వరద

- లక్ష్మీబరాజ్‌కు 3 లక్షల క్యూసెక్కులు
- భద్రాచలం వద్ద 40.20 మీటర్ల ప్రవాహం
- జూరాలకు 60 వేల క్యూసెక్కులు
- హెడ్‌క్వార్టర్స్ విడిచిపెట్టవద్దు: మంత్రి ఉత్తమ్

ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్, జూలై 19 (నమస్తే తెలంగాణ): ఎగువ రాష్ట్రాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. గోదావరికి వరద పోటెత్తుతున్నది. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. స్థానికంగా కురిసిన రికార్డుస్థాయి వర్షాలతోపాటు ప్రాణహిత, ఇంద్రావతి క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి గోదావరికి భారీగా వరద వస్తున్నది. శుక్రవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ప్రవాహం 43 మీటర్లకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 40.20 మీటర్ల మేరకు ప్రవాహం కొనసాగుతున్నది.

మేడిగడ్డ బరాజ్‌కు పెరిగిన వరద

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌లో వరద ఉధృతి పెరుగుతున్నది. శుక్రవారం మేడిగడ్డ బరాజ్‌కు 1,93,550 క్యూసెక్యుల ప్రవాహం వస్తున్నది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బరాజ్‌కు 15 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్టు అధికారులు తెలిపారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద 2.30 లక్షల క్యూసెక్కుల నీరు వస్తున్నది.

మేడిగడ్డపై ఆగని అసత్య ప్రచారాలు

మేడిగడ్డ బరాజ్‌పై అసత్య ప్రచారాలు ఆగడం లేదు. బరాజ్‌లో గత అక్టోబర్ 21న 20 పియర్ కుంగుబాటుకు గురికాగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచనల మేరకు మరమ్మతు పనులు పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం బరాజ్‌లో మరమ్మతు పనుల్లో భాగంగా గ్రౌటింగ్ చేసిన 20, 21 పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయని పుకార్లు చెక్కర్లు కొట్టాయి. దీంతో భారీ నీటి పారుదల శాఖ అధికారులు బరాజ్ వద్ద పరిస్థితిని, గ్రౌటింగ్ చేసిన పియర్‌లను పరిశీలించి ఎలాంటి కుంగుబాటు జరగలేదని నిర్ధారించారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

ములుగు జిల్లా వెంకటాపురం మండలం అలుబాక పంచాయతీ తానిపర్తికి చెందిన బానారి రాజు (45) గోదావరిలో గల్లంతయ్యాడు. గురువారం ఉదయం చేపల వేటకు వెళ్లిన రాజు శుక్రవారం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజు ఆచూకీ కోసం గ్రామస్థులు పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా ఘటనా స్థలికి వెళ్లి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

జూరాలకు భారీగా వరద

కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉరకలేస్తున్నది. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ప్రాజెక్టులకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. శుక్రవారం ఆల్మట్టి, తుంగభద్ర, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద వచ్చి చేరుతున్నది. నారాయణపూర్ ప్రాజెక్టు 22 గేట్లు ఎత్తారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమ కాల్వకు ఎన్ఎస్‌పీ అధికారులు శుక్రవారం నీటిని విడుదలచేశారు. పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు తొలిరోజు 500 క్యూసెక్కులతో ప్రారంభించి, క్రమంగా పెంచుకుంటూ రోజుకు 4,000 క్యూసెక్కల చొప్పున 4 రోజులపాటు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు.

హెడ్‌క్వార్టర్స్ విడిచిపెట్టవద్దు: మంత్రి ఉత్తమ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట దుర్ఘటన, భారీ నుంచి అతిభారీ వర్షపాతం నమోదయ్యే హెచ్చరికల నేపథ్యంలో చీఫ్ ఇంజినీర్లు, కార్యదర్శి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచిపెట్టవద్దని సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. రాబోయే 48 గంటలలో భారీ, అతి భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సాగునీటిపారుదలశాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ ఆదేశించారు.

కొనసాగుతున్న వర్షాలు

- పోటెత్తుతున్న వరద
- పలు గ్రామాల్లో నిలిచిన రాకపోకలు
- సత్తుపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- అధికారులతో సీఎస్ సమీక్ష

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట పెదవాగుకు వరద పోటెత్తడంతో గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదులుతున్నారు. ఎడవల్లి వాగు పొంగడంతో మహదేవపూర్-కాళేశ్వరం మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మహదేవపూర్ మండలం చంద్రపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ములుగు జిల్లా బొగత జలపాతానికి వరద తాకిడి పెరిగింది. సందర్శకుల రాకపోకలను నిలిపివేశారు. సమ్మక్క- సాగర్ బ్యారేజ్ దగ్గర గోదావరి వరద పెరిగింది. 52 గేట్లు ఓపెన్ చేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. కాగజ్‌నగర్‌లో అత్యధికంగా 15.39 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. మరోవైపు పెదవాగుకు వరద పోటెత్తడంపై సీఎస్ శాంతికుమారి సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్, ఎస్పీ, నీటిపారుదల అధికారులతో టెలికాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరుగకుండా చూడాలని ఆదేశించారు. సహాయ కార్యక్రమాల్లో పోలీసులు పాల్గొనాలని డీజీపీ జితేందర్ సూచించారు.

వాయుగుండంగా అల్పపీడనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం వాయుగుండంగా మారిందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. శనివారం తెల్లవారుజామున ఒడిశా తీరాన్ని దాటే అవకాశముందని తెలిపింది. దీంతో రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురువొచ్చని పేర్కొన్నది. ఈ మేరకు రెడ్, ఎల్లో అలర్టులను జారీ చేసింది. ఇంకోవైపు ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది.

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఉత్తర తెలంగాణలోని 11 జిల్లాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. 11 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో కలెక్టర్లతో శుక్రవారం రాత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, హన్మకొండ, జగిత్యాల, ఖమ్మం, కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలిసి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టరేట్లలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేయాలని, పోలీస్ ఇతర శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినాచోంగ్తు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వద్ద ట్రయల్ రన్ చేసిన ఇంజినీరింగ్ అధికారులు

'సీతారామ' ట్రయల్ రన్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ): సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్ రన్‌లో భాగంగా శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులు రెండో మోటర్‌ను ఆన్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఉన్న ఏడు మోటర్లలో మొదటిసారిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ట్రయల్ చేయగా.. రెండో మోటర్‌ను ఇరిగేషన్ అధికారుల బృందం శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించింది. చైనా టెక్నాలజీతో తయారైన ఈ మోటర్ల పనితీరును అధికారులు పరిశీలించారు. ఆగస్టు కల్లా సాగునీరు అందించేలా అధికారులు పనులను వేగవంతం చేస్తున్నారు.

పెదవాగు.. పెద్ద కష్టం

- పాలకుల వైఫల్యం.. అధికారుల నిర్లక్ష్యం
- భారీ వరదతో అర్ధరాత్రి మూడు గండ్లు
- తాగునీరు, విద్యుత్తు లేక రెండు రోజులుగా అల్లాడుతున్న గ్రామస్తులు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ)/అశ్వారావుపేట రూరల్: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు గురువారం అర్ధరాత్రి గండ్లు పడ్డాయి. రుణమాఫీ సంబురాల్లో మునిగి తేలిన పాలకులు ఇటువైపు కనీసం కన్నెత్తి చూడలేదు. 300 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. 100 ఎకరాల్లో వరి పంటలు, మరో 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు కొట్టుకుపోయాయి. దిగువ గ్రామాల్లో ఇండ్లు నీటి మునిగాయి. రహదారులు కోతకు గురయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. తాగునీరు, విద్యుత్తు సరఫరా లేక ఆయా గ్రామాల ప్రజలు రెండు రోజులుగా అల్లాడుతున్నారు.

మొత్తం మూడు గండ్లు

పెదవాగు ప్రాజెక్టుకు మూడు గండ్లు పడ్డాయి. 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు గుమ్మడవల్లి సమీపంలో పెదవాగుపై ప్రాజెక్టు నిర్మించారు. 6 మీటర్లు (40 వేల క్యూసెకులు) నీటి సామర్థ్యం, 16 వేల ఎకరాల సాగు లక్ష్యం. గుబ్బల మంగమ్మ అటవీ ప్రాంతం, చుట్టూ ఉన్న కొండల నుంచి వచ్చే వర్షపు నీరే ఆధారం. 1984లో ఈ ప్రాజెక్టుకు ఒకసారి గండి పడింది. 2014లో రాష్ట్ర విభజన తరువాత అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల రైతులు దీని కింద 2,360 ఎకరాలు సాగు చేస్తున్నారు. బచ్చువారిగూడెం, మల్లాయిగూడెం చెరువులకు గండ్లు పడ్డాయి.

విద్యుత్తు శాఖకు భారీ నష్టం

నారాయణపురం-గుమ్మడవల్లి మార్గంలో 50కి పైగా విద్యుత్తు స్తంభాలు కూలిపడ్డాయి. పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. గుమ్మడవల్లిలోని 50 నివాసాల్లోని వరదనీరు చేరింది. జెట్టివారిగూడెంలో పాజెక్టు భవనాల్లో తలదాచుకున్నారు.

భద్ర